సాక్షి కాకినాడ

శుక్రవారం । 5 । సెప్టెంబర్ । 2025



అన్నదానానికి రూ.49,998 విరాళం

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రంలో అన్నదానానికి సోనాల్ అహుజీ (ఛత్తీస్‌గఢ్) రూ.49,998 విరాళం అందజేశారు.



అన్న ప్రసాద భవనానికి రూ.లక్ష

కొత్తపేట: వాడపల్లిలో వకుళమాత అన్న ప్రసాద భవన నిర్మాణానికి కల్లా శేమకుమారి, కుటుంబ సభ్యులు (నర్సీపట్నం) రూ.1,00,116 విరాళంగా సమర్పించారు.



నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష

అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి కందుకూరి ప్రభాకర రావు (హైదరాబాద్) గురువారం రూ.లక్ష విరాళం అందజేశారు.

న్యూస్‌రీల్

పట్టుగూళ్ల ఉత్పత్తిలో కీలకపాత్ర ఉష్ణోగ్రతలదే

తుని రూరల్: పట్టుగూళ్ల ఉత్పత్తిలో కీలకపాత్ర ఉష్ణోగ్రతలదేనని సెంట్రల్ సిల్క్ బోర్డు శాస్త్రవేత్త ఈ భువనేశ్వరి అన్నారు. గురువారం దొండవాకలో చేబ్రోలు అసిస్టెంట్ సెరికల్చర్ ఆఫీసర్ కె.సత్యనారాయణ ఆధ్వర్యంలో పట్టు పురుగుల్లో వివిధ దశలు, పట్టుగూళ్ల ఉత్పత్తిలో జాగ్రత్తలపై రైతులకు శిక్షణ, అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న శాస్త్రవేత్త భువనేశ్వరి మాట్లాడుతూ పట్టు పురుగులు గూడు అల్లుకునే 5వ దశలో 12 మేతలకు మల్బరీ ఆకులను అందించి, స్పిన్నింగ్ దశను గుర్తించాలన్నారు. గూడు కట్టడానికి తగినంత స్థలాన్ని కేటాయించాలన్నారు. ఈ దశలో ఉష్ణోగ్రత, తేమ, వెలుతురు, పరిశుభ్రత చంద్రికలు నాణ్యమైన పట్టుగూళ్ల అల్లడంలో ప్రధాన పాత్ర వహిస్తాయన్నారు. పట్టుగూళ్లు అల్లిన తర్వాత నాలుగు రోజులకు వేరు చేయాలని, ఆరో రోజు మార్కెట్‌కు తరలించాలన్నారు. నాణ్యతగల పట్టుగూళ్లకు మంచి గిట్టుబాటు ధర లభిస్తుందన్నారు. సెరికల్చర్ అసిస్టెంట్‌లు, రైతులు పాల్గొన్నారు.

7న తలుపులమ్మ దేవస్థానం మూసివేత

తుని రూరల్: చంద్రగ్రహణం సందర్భంగా ఈ నెల ఏడో తేదీన మధ్యాహ్నం తలుపులమ్మ అమ్మవారి ఆలయాన్ని మూసివేస్తున్నట్టు కార్యనిర్వహణ అధికారి పెన్మెత్స విశ్వనాథరాజు గురువారం తెలిపారు. లోవ దేవస్థానంలో ఆ రోజు మధ్యాహ్నం 1.30 గంటలకు కవాట బంధనం చేసి మరుసటి రోజు ఉదయం 8.30 గంటలకు సంప్రోక్షణ అనంతరం భక్తులకు అమ్మవారి దర్శనం కల్పిస్తామన్నారు.

అన్నవరం ఆలయ ఈఓ సుబ్బారావుకు స్థాన చలనం?



వీర్ల సుబ్బారావు, ఈఓ

అన్నవరం: శ్రీవీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం కార్యనిర్వాహణాధికారిగా పనిచేస్తున్న డిప్యూటీ కలెక్టర్ వీర్ల సుబ్బారావును ఆ పదవి నుంచి తప్పించి, ఆయన మాతృసంస్థ రెవెన్యూ శాఖకు సరెండర్ చేయాలని దేవదాయశాఖ ఉన్నతాధికారులు ప్రభుత్వానికి సిఫారసు చేశారు. ఈ మేరకు ఒకటి రెండ్రోజుల్లో ఆదేశాలు వెలువడే అవకాశం ఉందని సమాచారం. దేవదాయశాఖకు చెందిన ఆర్‌జేసీ స్థాయి అధికారిని ఇన్‌చార్జి ఈఓగా నియమించనున్నట్టు తెలిసింది. దీనిపై వివరణ కోరగా తాను దేవదాయశాఖ ఉద్యోగిని కాదని, ఏదో రోజు నా మాతృ సంస్థ రెవెన్యూ శాఖకు వెళ్లవలసిన వాడినేనని ఈఓ సుబ్బారావు తెలిపారు.

8న ప్రభుత్వ ఐటీఐలో పీఎం అప్రెంటిస్ మేళా

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): కాకినాడ ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 8వ తేదీన ప్రధానమంత్రి అప్రెంటిస్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎం.జీ.వర్మ గురువారం తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన మేధా గ్రూప్ కంపెనీ 300 అప్రెంటిస్ ఖాళీలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నాయని, ఐటీఐలో వెల్డర్, ఫిట్టర్, ఎలక్ట్రీషియన్ ఉత్తీర్ణులై ఎన్‌టీసీ సర్టిఫికెట్ కలిగిన వారు సర్టిఫికెట్లతో ఉదయం 8గంటలకు హాజరుకావాలని సూచించారు. స్టైపెండ్ నెలకు రూ.15వేలు చెల్లిస్తారని, వివరాలకు 94404 08182 నంబర్‌లో సంప్రదించవచ్చని సూచించారు.

మళ్లీ పెరుగుతున్న నీటి ఉధృతి



కాటన్ బ్యారేజీ నుంచి విడుదల చేస్తున్న మిగులు జలాలు

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ వద్ద నీటి ఉధృతి మళ్లీ పెరుగుతోంది. గురువారం ఉదయం 6 గంటలకు 10.50 అడుగులు ఉన్న నీటిమట్టం క్రమేపీ పెరుగుతూ రాత్రి 7గంటలకు 11.30 అడుగులకు చేరింది. బ్యారేజీ నుంచి 9,11,254 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. మరోపక్క ఎగువ ప్రాంతాల్లో నీటి మట్టాలు స్వల్పంగా తగ్గుతున్నాయి. శుక్రవారం ధవళేశ్వరం వద్ద నీటి ఉధృతి స్వల్పంగా తగ్గుతుందని ఇరిగేషన్ అధికారులు అంచనా వేస్తున్నారు. డెల్టా కాలువలకు సంబంధించి 12,200 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 4,900, మధ్య డెల్టాకు 2,300, పశ్చిమ డెల్టాకు 5,000 క్యూసెక్కుల నీటిని వదిలారు. ఎగువ ప్రాంతాలకు సంబంధించి కాళేశ్వరంలో 10.49 మీటర్లు, పేరూరులో 15.36 మీటర్లు, దుమ్ముగూడెంలో 11.76 మీటర్లు, భద్రాచలంలో 42.90 అడుగులు, కూనవరంలో 9.78 మీటర్లు, కుంటలో 18.36 మీటర్లు, పోలవరంలో 11.80 మీటర్లు, రాజమహేంద్రవరం రైల్వే బ్రిడ్జి వద్ద 15.85 మీటర్లు వద్ద నీటి మట్టాలు కొనసాగుతున్నాయి.

లీడర్లే టార్గెట్

- వైఎస్సార్ సీపీ క్రియాశీలక నేతలే లక్ష్యంగా కూటమి కక్ష సాధింపు
- అక్రమ కేసుల పరంపర
- దారికి రాకుంటే వేధింపులు
- కేసులకు బెదిరేది లేదంటున్న శ్రేణులు
- 86 ఏళ్ల వృద్ధుడిపై కేసులా
- విస్మయం వ్యక్తం చేస్తోన్న టీడీపీ నేతలు

సాక్షి ప్రతినిధి, కాకినాడ: అధికారం చేతిలో ఉందని కూటమి నేతలు బరి తెగిస్తున్నారు. ఇష్టారాజ్యంగా తెలుగు తమ్ముళ్లు పేట్రేగిపోతున్నారు. వైఎస్సార్ సీపీలో క్రియాశీలక నేతలను లక్ష్యంగా చేసుకుని తెలుగుదేశం నేతలు వేధింపుల పర్వానికి తెర తీశారు. గద్దె నెక్కిన దగ్గర నుంచి వివిధ నియోజకవర్గాల్లో కూటమి నేతలు పోలీసులపై ఒత్తిడి తీసుకువచ్చి అక్రమ కేసులు బనాయించడంలో ముందుంటున్నారు. వైఎస్సార్ సీపీ కోసమే పనిచేయడమే పెద్ద నేరం అన్నట్టుగా ఆ పార్టీ నేతలను బెదిరించి దారికి తెచ్చుకోవాలని కేసులతో కుట్రలు పన్నుతున్నారు. జిల్లాలోని జగ్గంపేట, తుని, ప్రత్తిపాడు, కాకినాడ...ఇలా ప్రతి నియోజకవర్గంలోను ఏదో ఒక కారణంతో పోలీసులను బలవంతం చేసి వైఎస్సార్ సీపీ నేతలపై అనేక కేసులు నమోదు చేయిస్తున్నారు. వేధింపులతో పాటు అన్యాయంగా కేసులు నమోదు చేయడం చూస్తుంటే ఇదంతా కక్ష సాధింపు చర్యల్లో భాగమేనని విజ్ఞులు విశ్లేషిస్తున్నారు.

జిల్లాలోని ప్రత్తిపాడు మండలం ధర్మవరం గ్రామంలో వయోభారంతో బాధపడుతోన్న 86 ఏళ్ల ముదునూరి రామరాజుపై తాజాగా అక్కడి పోలీస్ స్టేషన్‌లో ఒక మహిళను అడ్డం పెట్టుకుని అక్రమ కేసు పెట్టడం వేధింపులు పరాకాష్టకు చేరుకున్నాయనేందుకు నిదర్శనంగా నిలుస్తోంది. రామరాజు తనయుడు ముదునూరి మురళీకృష్ణంరాజు నరసాపురం పార్లమెంటరీ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ పరిశీలకుడు కావడమే పాపం అన్నట్టుగా ఉంది. ఆయన పార్టీలో క్రియాశీలకంగా ఉండటం ప్రత్తిపాడు మండలంలో తెలుగుతమ్ముళ్లు జీర్ణించుకోలేక పోతున్నారు. నిత్యం ప్రజలతో మమేకం అవుతూ ఉండటం ఆ పార్టీ నేతలకు కంటగింపుగా మారింది. ఎవరో ఒకరి సహాయం లేకుండా రామరాజు అడుగు ముందుకు వేయలేని పరిస్థితి. అటువంటి రామరాజు అసభ్యంగా ప్రవర్తించారంటూ ప్రత్తిపాడులో అక్రమంగా కేసు బనాయించారని స్థానికులు ఆక్షేపిస్తున్నారు. ముదునూరిని వైఎస్సార్ సీపీలో ముందుకు వెళ్లకుండా అడ్డుకట్ట వేసే ఎత్తుగడతోనే పోలీసులపై ఒత్తిడి తీసుకువచ్చి కేసులతో బెదిరింపులకు దిగుతున్నారని వైఎస్సార్ సీపీ నేతలు మండిపడుతున్నారు. రామరాజుపై కేసు నమోదుచేసే ముందు కనీసం అతని వయసునైనా పరిగణలోకి తీసుకోకపోవడాన్ని గ్రామస్తులు ఆక్షేపిస్తున్నారు. కేవలం రాజకీయ కోణంలో అక్రమ కేసులు బనాయిస్తూ పోతే చూస్తూ ఉపేక్షించేదిలేదని పార్టీ నేతలు హెచ్చరిస్తున్నారు. అధికార పార్టీ నేతల ముఖాల్లో సంతోషం కోసం ఇటువంటి కేసులు పెట్టడం అన్యాయమంటున్నారు. అంత వయసు కలిగిన రామరాజుపై కేసు విషయంలో టీడీపీ నేతలే విస్మయం వ్యక్తం చేస్తున్నారు. పై పెచ్చు రామరాజుపై కేసును సమర్థించుకునే రీతిలో టీడీపీ నేతలు మీడియా సమావేశం పెట్టడం చర్చనీయాంశంగా మారింది. అసభ్యంగా ప్రవర్తించడానికి వయసుతో పనేమిటంటూ వితండవాదాన్ని తమ్ముళ్లు తెర మీదకు తీసుకువచ్చారు.



వయోభారంతో నిలబడలేని స్థితిలో బాధపడుతున్న ముదునూరి మురళీకృష్ణంరాజు తండ్రి రామరాజును విచారిస్తున్న ప్రత్తిపాడు ఎస్‌ఐ లక్ష్మీకాంతం (ఫైల్)



తుని పోలీసు స్టేషన్‌లో నిర్బంధంలో ఉన్న వైఎస్సార్ సీపీ నాయకుడు నాగం గంగబాబు తదితరులు (ఫైల్)

ఏడాదిగా ఇదే తంతు

వైఎస్సార్ సీపీ నేతలు లక్ష్యంగా అక్రమ కేసులు బనాయించడం గడచిన ఏడాదిన్నరగా సాగుతోంది. తునిలో పలువురు వైఎస్సార్ సీపీ నేతలపై అక్రమ కేసులు బనాయించారు. ఫిబ్రవరిలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక సందర్భంగా మాజీ మంత్రి, పార్టీ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా, అప్పటి మున్సిపల్ చైర్ పర్సన్ ఏలూరు సుధారాణిపై కౌన్సిలర్లను నిర్బంధించారంటూ తుని పట్టణ పోలీస్ స్టేషన్‌లో రెండు కేసులు బనాయించారు. ఈ వ్యవహారంలో వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లను క్యాంపునకు తరలించారంటూ వైఎస్సార్ సీపీ నేతలు రేలంగి రమణ గౌడ్, పోతుల లక్ష్మణ్, షేక్ క్వాజా, చింతల పండు, పామర్తి మహేష్ తదితరులపై తుని టౌన్ పోలీస్ స్టేషన్లో కిడ్నాప్ కేసు నమోదు చేయడం గమనార్హం. వైఎస్సార్ సీపీ కౌన్సిలర్‌లంతా సమావేశానికి వెళితే టీడీపీ నేతలు కక్ష కట్టి కిడ్నాప్ కేసు పెట్టడం అప్పట్లో సంచలనమైంది. మాజీ మంత్రి దాడిశెట్టి రాజా ముఖ్య అనుచరుడనే కారణంతో తొండంగి మండలం వైస్ ఎంపీపీ నాగం గంగబాబు తదితరులపై అక్రమ కేసులు బనాయించారు. కోటనందూరు మండలం అల్లిపూడికి చెందిన చింతకాయల చినబాబుతో పాటు మరో ముగ్గురిపై సోషల్ మీడియాలో పోస్టు పెట్టారంటూ కేసు నమోదు చేశారు. తుని మండలం తేటగుంట, వెలమకొత్తూరు, ఎస్ సూరవరం గ్రామానికి చెందిన ముగ్గురు వైఎస్సార్ సీపీ నేతలపై కేసులు బనాయించడాన్ని ఈ సందర్భంగా ప్రస్తావిస్తున్నారు. ప్రత్తిపాడులో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రామిశెట్టి బులిరామకృష్ణ మహిళను వేధిస్తున్నారంటూ కేసు పెట్టారు. శరభవరం ఎంపీటీసీ అమరాధి కాశీ జగన్నాథంపై ఇదివరకే కేసులు బనాయించారు. గత జనవరిలో శరభవరం ఉపాధి హామీ సమావేశంలో అక్కడి వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ సభ్యుడు అమరాధి కాశీ జగన్నాథంపై స్థానిక టీడీపీ నేతలు దాడికి పాల్పడ్డారు. కానీ తెలుగు తమ్ముళ్లు పోలీసులపై ఒత్తిడి తీసుకువచ్చి బాధితులపైనే కేసులు నమోదు చేయించారు. గత అక్టోబర్‌లో ఉత్తరకంచి ఎంపీటీసీ సభ్యుడు ఉమ్మిడి అచ్చన్న(తాతీలు)పై భూ వివాదాన్ని సృష్టించి అక్రమంగా కేసు బనాయించి వేధింపులకు గురిచేశారు.

సర్వత్రా విస్మయం

జగ్గంపేట నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కన్వీనర్ కాపవరపు రమణపై కూటమి నేతలు జగ్గంపేట పోలీస్‌స్టేషన్‌లో అక్రమంగా కేసు బనాయించి వేధింపులకు పాల్పడ్డారు. అక్కడి పోలీసులు రమణను ఒక రోజంతా జగ్గంపేట పోలీస్ స్టేషన్‌లోనే నిర్బంధించడాన్ని ఈ సందర్భంగా అక్కడి పార్టీ నేతలు ప్రస్తావిస్తున్నారు. మెట్ట ప్రాంతమైన శంఖవరం మండలం మండపంలో గత డిసెంబరు 27న వైఎస్సార్ సీపీ కార్యకర్త గుండుపల్లి నానాజీ పొలం పనులకు వెళ్లి తిరిగి వస్తుండగా టీడీపీ నాయకులు దారి కాసి కత్తులతో దాడి చేశారు. తీవ్ర రక్త స్రావంతో బాధపడుతోన్న నానాజీని తుని ప్రభుత్వ ఆసుపత్రికి, మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఇలా జిల్లాలోని దాదాపు అన్ని ప్రాంతాల్లోను వైఎస్సార్ సీపీ నేతల్లో భయోత్పాతాన్ని సృష్టించి కట్టడి చేసే కుట్రలో భాగంగా తెలుగు తమ్ముళ్లు వేధింపులకు దిగుతూ, బనాయిస్తోన్న అక్రమ కేసులపై సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది.

తాటాకు చప్పుళ్లకు బెదిరేది లేదు

వైఎస్సార్ సీపీ నరసాపురం పార్లమెంటరీ పరిశీలకుడు మురళీకృష్ణంరాజు

ప్రత్తిపాడు రూరల్: టీడీపీ నేతల తాటాకు చప్పుళ్లకు బెదిరేదిలేదని వైఎస్సార్ సీపీ నరసాపురం పార్లమెంటరీ పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు అన్నారు. గురువారం మండలంలోని ధర్మవరంలో ఆయన స్వగృహంలో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. గ్రామంలో టీడీపీ నియోజకవర్గ నేతలు మీడియా సమావేశంలో మురళీకృష్ణంరాజుపై పలు విమర్శలు చేశారు. వారి విమర్శలను మురళీకృష్ణంరాజు మీడియా ముఖంగా తీవ్రంగా ఖండించారు. ఆయన మాట్లాడుతూ, మహిళతో అసభ్యంగా ప్రవర్తించడానికి, 86 ఏళ్ల వయస్సుకు సంబంధం లేదంటూ టీడీపీ నేతలు మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. మునుపెన్నడూ లేని విధంగా నియోజకవర్గంలో అవినీతి, అక్రమాలు జరుగుతున్నాయన్నారు. వాటిని ప్రశ్నిస్తే టీడీపీ నేతలు బెదిరింపులకు దిగుతున్నారన్నారు. రాజకీయ కక్ష సాధింపులే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. పార్టీ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబుతో కలిసి.. తమ పార్టీ శ్రేణులకు ఏ ఆపద వచ్చినా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. వైఎస్సార్ సీపీ శ్రేణులు భారీఎత్తున తరలివచ్చి మురళీకృష్ణంరాజుకు మద్దతుగా నిలిచారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు జల్లిగంపల ప్రభాకరరావు, ఏనుగు శ్రీను, గొనగాల అప్పలరావు, నడిగట్ల త్రిమూర్తులు, జువ్వల బాబులు, ఉమ్మిడి తాతీలు, మాకా చంటిబాబు, తటవర్తి రామన్నదొర, బత్తుల నాగార్జున, దాడిశెట్టి చక్రధర్, సీంద్రపు భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మురళీకృష్ణంరాజు

వైఎస్సార్ సీపీ అభివృద్ధికి సత్యనారాయణ కృషి

సంతాప సభలో పలువురు నేతలు

కాకినాడ రూరల్: వైఎస్సార్ సీపీ అభివృద్ధికి కురసాల సత్యనారాయణ విశేషంగా కృషి చేశారని, ఆయన మృతి బాధాకరమని, మాజీ మంత్రి కన్నబాబుకు తండ్రి లేని లోటు తీర్చలేనిదని పలువురు నేతలు పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర జిల్లాల రీజనల్ కో ఆర్డినేటరు కురసాల కన్నబాబు తండ్రి సత్యనారాయణ అనారోగ్యంతో గత నెల 19న మృతిచెందిన సంగతి విదితమే. కాకినాడ వైద్యనగర్‌లో సత్యనారాయణకు గురువారం దశ దినకర్మలను కుమారులు కన్నబాబు, ఆయన సోదరుడు కళ్యాణ్‌కృష్ణ, కుటుంబ సభ్యులు నిర్వహించారు. ఏ సందర్భంగా ఏర్పాటు చేసిన సంతాప సభలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా, ఎమ్మెల్సీలు తలశిల రఘురామ్, అనంతబాబు, పేరాబత్తుల రాజశేఖర్, మాజీ డిప్యూటీ సీఎం నారాయణ స్వామి, మాజీ మంత్రులు గుడివాడ అమర్‌నాథ్, కారుమూర్తి నాగేశ్వరరావు, చెల్లుబోయిన వేణు, వెల్లంపల్లి శ్రీనివాస్, జెడ్పీ చైర్మ న్ విప్పర్తి వేణుగోపాలరావు, ఎమ్మెల్యే చినరాజప్ప, మాజీ ఎమ్మెల్యేలు ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, జక్కంపూడి రాజా, రౌతు సూర్యప్రకాశరావు, కరణం ధర్మశ్రీ, సత్తి సూర్యానారాయణరెడ్డి, జ్యోతుల చంటిబాబు, పాముల రాజేశ్వరి, వరుపుల సుబ్బారావు, మాజీ ఎంపీ వంగా గీత, ఆధ్యాత్మిక గురురు ఉమర్ ఆలీషా, మాజీ ఎమ్మెల్సీ పండుల రవీంద్ర, వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి గూడూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.



కన్నబాబుతో దాడిశెట్టి రాజా, జెడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు, జక్కంపూడి రాజా తదితరులు

ఉద్యోగులపై పని ఒత్తిడి తగ్గించాలి

గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు

సీటీఆర్‌ఐ (రాజమహేంద్రవరం): గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులపై పని ఒత్తిడి తగ్గించాలని గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎండి జానీ పాషా అన్నారు. గురువారం రాజమహేంద్రవరంలోని ఏపీఎన్‌జీజీఓల అసోసియేషన్ కార్యాలయంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఫెడరేషన్ కో ఆర్డినేటర్ దడాల జగ్గారావు ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామ వార్డు సచివాలయ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా సమావేశంలో ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.డి.జానీ పాషా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్తుల అంకమ్మరావు పాల్గొన్నారు. జానీ పాషా మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులకు రికార్డ్ అసిస్టెంట్ క్యాడర్ మార్పు చేసి జూనియర్ అసిస్టెంట్ క్యాడర్ సాధించడం కోసం నోషనల్ ఇంక్రిమెంట్లు సాధించడం కోసం కృషి చేస్తున్నామన్నారు. సచివాలయ ఉద్యోగులు అంటే కట్టు బానిసలుగా భావిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని, ఉద్యోగులు ఎట్టి పరిస్థితిలో బానిసలు కాదన్నారు. సచివాలయాల శాఖ సర్వేల శాఖగా మారిపోయిందన్నారు. సమావేశానికి హాజరైన వివిధ విభాగాల సచివాలయ ఉద్యోగులు రాష్ట్ర నాయకత్వం దృష్టికి అనేక సమస్యలను తీసుకొచ్చారు. రాజమహేంద్రవరం ఏపీఎన్‌జీజీఓ అసోసియేషన్ నగర అధ్యక్షుడు పి.అనిల్‌కుమార్, నగర కార్యదర్శి సేవా ప్రవీణ్, కొల్లిరాజేష్, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జానీ పాషా తదితరులు

సొసైటీ భవనం వేలం వాయిదా



కార్తికేయ సొసైటీ వద్ద వేలం నిర్వహిస్తున్న సహకారశాఖ అధికారులు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): సుమారు రూ.23 కోట్ల మేర ప్రజలకు కుచ్చుటోపీ పెట్టిన కార్తికేయ కోఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ భవనం వేలం వాయిదా పడింది. సొసైటీ చైర్మన్ కోడి వీరవెంకట సత్యనారాయణతో పాటు ఇతర డైరెక్టర్లు ప్రజల నుంచి డిపాజిట్లు తీసుకుని, వడ్డీ చెల్లించకుండా ముఖం చాటేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో సొసైటీ ఆస్తులను సహకార శాఖ ఆధ్వర్యంలో స్వాధీనం చేసుకునేందుకు అప్పట్లో ఉత్తర్వులు జారీ చేశారు. ఆ ఆస్తులను అమ్మి ప్రజల డిపాజిట్లు చెల్లించేందుకు సహకార శాఖ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ మేరకు గురువారం కాకినాడ నూకాలమ్మ గుడి వద్ద ఉన్న సొసైటీకి చెందిన మూడు అంతస్తుల భవనానికి వేలం పాట వేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. సహకార శాఖ అధికారులు అనుకున్న మేర వేలం సొమ్ము రాకపోవడంతో తిరిగి ఈ నెల 8న సోమవారం రెండు గంటలకు వేలం పాట నిర్వహిస్తున్నట్లు సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్టర్, సేల్స్ ఆఫీసర్ జె.శివకామేశ్వరరావు తెలిపారు.

క్రైస్తవులకు అండగా వైఎస్సార్ సీపీ

రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు జాన్ వెస్లీ

అమలాపురం రూరల్: క్రైస్తవులకు వైఎస్సార్ సీపీ ఎప్పుడూ అండగా ఉంటూ వారి హక్కుల పరిరక్షణకు పోరాడుతుందని పార్టీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు బొల్లవరపు జాన్ వెస్లీ అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో గురువారం పార్టీ జిల్లా సెల్ అధ్యక్షురాలు ఈదా సంధ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో వెస్లీ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ బలోపేతానికి గ్రామాల్లోని క్రిస్టియన్ మైనార్టీ సెల్ నాయకులు కృషిచేయాలని సూచించారు. క్రమశిక్షణ కలిగిన నాయకులుగా ఉండడంతోనా పాటు పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై విశ్వాసాన్ని ఉంచి పార్టీని మందుకు తీసుకెళ్లాలన్నారు. అలాగే క్రైస్తవులకు పార్టీ ఎప్పుడూ అండగా ఉందని, రాబోయే రోజుల్లో పార్టీని అధికారంలోకి తీసుకవచ్చేలా అంతా కృషిచేయాలని సూచించారు. కష్టపడిన వారికి పార్టీలో ఎప్పుడూ సరైన గుర్తింపు లభిస్తుందన్నారు. దానికి అనుగుణంగా గ్రామస్థాయిలో కార్యకర్తలకు నియోజకవర్గ నాయకునిగా ఎదిగే అవకాశాలున్నాయని తెలిపారు. జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి క్రైస్తవుల సమస్యలను పరిష్కరించేలా అందుబాటులో ఉంటారని అన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జాన్ వెస్లీ

అధరకొడుతున్న కొబ్బరి



ఎగుమతికి సిద్ధమవుతున్న పచ్చి కొబ్బరికాయలు

- అంబాజీపేట మార్కెట్‌లో వెయ్యి కాయల ధర రూ.23 వేల నుంచి రూ.24 వేలు
- కురిడీ కొబ్బరి రూ.31,500కు చేరిక
- ఆరు నెలలుగా రికార్డు స్థాయిలో ధరలు
- వరుస పండగల ప్రభావం

సాక్షి, అమలాపురం/అంబాజీపేట: కొబ్బరి ధరలు రికార్డుల మీద రికార్డులు సృష్టిస్తున్నాయి. గత ఆరు నెలలుగా రైతుల అంచనాలకు మించి ధరలు నమోదవుతున్నాయి. కురిడీ కొబ్బరి కొత్త రికార్డులు నమోదు చేస్తుండగా.. పచ్చి కాయలు సైతం ఆల్‌టైమ్ హైకి చేరాయి. తొలుత పచ్చి కొబ్బరి కాయ ధర రూ.15 ఉండగా.. ఆ తర్వాత అది రూ.17కు చేరడంతో రైతులు సంబరపడ్డారు. అది కాస్తా రూ.19కి.. ఆపై రూ.20కి, రూ.22కి.. ఇప్పుడు ఏకంగా రూ.24కు చేరింది. ప్రస్తుతం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మార్కెట్‌లో వెయ్యి కొబ్బరికాయల ధర రూ.23 వేల నుంచి రూ.24 వేల వరకు పలుకుతోంది. ఈ స్థాయిలో ధర రావడం ఇదే తొలిసారి. దీంతో అంబాజీపేట మార్కెట్‌లో జోష్ నెలకొంది. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల నుంచి రోజుకు 130 లారీల కొబ్బరికాయలు ఉత్తరాది రాష్ట్రాలకు ఎగుమతి అవుతున్నాయని రైతులు చెబుతున్నారు.

కురిడీకి భలే డిమాండ్..

కురిడీ కొబ్బరి ధరలు కూడా భారీగా పెరిగాయి. పాతకాయలలో గండేరా రకానికి(పెద్ద కాయ) చెందిన వెయ్యి కాయల ధర రూ.31,500 ఉంది. అదే గటగటా రకం(చిన్నకాయ) రూ.30 వేలు పలుకుతోంది. ఇక కొత్తకాయలో గండేరా రకం రూ.30 వేలు.. గటగటా రకం రూ.28,500 వరకు ధర ఉంది. కోనసీమ జిల్లా నుంచి రోజుకు 40 లారీల కురిడీ కొబ్బరి ఉత్తరాది రాష్ట్రాలకు ఎగుమతి అవుతోందని వ్యాపారులు చెబుతున్నారు.

ఇతర రాష్ట్రాల్లో తగ్గిన దిగుబడులు

- దక్షిణాదిలో ఏపీ తప్ప మిగిలిన రాష్ట్రాల్లో కొబ్బరి దిగుబడులు తగ్గాయి. కేరళలో 40 శాతం, తమిళనాడు, కర్ణాటకలో 30 శాతానికి పైగా దిగుబడి తగ్గింది. దీంతో గుజరాత్, రాజస్తాన్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, బిహార్ తదితర రాష్ట్రాలకు ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల నుంచి కొబ్బరి కాయలను ఎగుమతి చేస్తున్నారు.
- అలాగే వరుస పండగలు కూడా ధరల పెరుగుదలకు కారణమని వ్యాపారులు చెబుతున్నారు. ఇప్పటికే వినాయకచవితి వేడుకలు జరుగుతుండగా.. నెలాఖరు నాటికి దసరా, ఆ తర్వాత దీపావళి, ఆ వెంటనే కార్తీక మాసం మొదలుకానుంది. దీంతో ఉత్తరాది రాష్ట్రాల నుంచి కొబ్బరికి ఎక్కువగా ఆర్డర్లు వస్తుండడం కూడా ధరల పెరుగుదలకు కారణమని వెల్లడించారు.



ఉత్తరాది రాష్ట్రాలకు కొబ్బరి ఎగుమతి

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్త కొబ్బరి (క్వింటాల్)	20,000 – 21,500
కొత్త కొబ్బరి (రెండో రకం)	10,500 – 12,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	31,500
గటగట (వెయ్యి)	30,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	30,000
గటగట (వెయ్యి)	28,500
నీటికాయ	
పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	23,000 – 24,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	23,000 – 24,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	5,250
కిలో	350

గురువు.. తిమిరంలో తేజోమూర్తి



డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్

- బాలలను బాధ్యత గల పౌరులుగా తీర్చిదిద్దే నేర్పరి
- రేపు ఉపాధ్యాయ దినోత్సవం

రాయవరం: 'గురవంటే రెండు బెత్తం దెబ్బలు.. నాలుగు గుంజీలు తీయించడం కాదు.. కొండంత చీకటిలో తేజోమయంగా వెలిగే దీపం. గురవంటే పసిపిల్ల పెదాలపై విరిసిన నవ్వురేఖ..' ఈ మాటలన్నది ఉపాధ్యాయ వృత్తికే వన్నెతెచ్చిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్. అజ్ఞానపు తిమిరాన్ని పారదోలి విజ్ఞాన కాంతులు ప్రసరింపజేసే మార్గదర్శకులు గురువులు. విద్యార్థిని సానబట్టి వజ్రంలా తయారు చేసే అక్షర శిల్పులు. అందుకే ప్రముఖ విద్యావేత్త డాక్టర్ కొఠారి దేశ భవిష్యత్ తరగతి గదిలోనే రూపుదిద్దుకుంటుందన్నారు. ఎంతటి శాస్త్రవేత్త అయినా, దేశానికి ప్రధాని అయినా ఒక ఉపాధ్యాయుడి వద్ద ఓనమాలు నేర్చుకున్న వారే. గురువుల స్ఫూర్తితో ఉన్నత స్థానాలకు ఎదిగిన వారు ఎందరో ఉన్నారు. శుక్రవారం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతిని పురస్కరించుకుని ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్న వేళ గురువులపై పలువురి అభిప్రాయాలతో కథనం..

గురువు పాత్ర ఎనలేనది



సమాజంలో గురువు పాత్ర ఎనలేనిది. నిరంతర విద్యార్థిగా ఉంటూ తన శిష్యులను ఉన్నత స్థానంలో నిలపడానికి ప్రయత్నిస్తుంటారు. పశ్చిమగోదావరి జిల్లా నిడదవోలు జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదివే సమయంలో వయోల మేడమ్ సైన్స్, ఇంగ్లిష్ బోధించేవారు. ఆమె బోధనా విధానం నన్ను ప్రభావితం చేసింది. ఉపాధ్యాయులు నేరిన విద్యతోనే ఈ రోజు జిల్లా అధికారిగా రాణించగలుగుతున్నాను.

– జి.మమ్మీ, డిప్యూటీ కలెక్టర్, ఏపీసీ, సమగ్ర శిక్షా, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

గురువుల మార్గదర్శకత్వంతోనే ఈ స్థాయికి



నా తొలి గురువులు తల్లిదండ్రులు షేక్ మీరాబి, కరీమ్. చిన్నతనం నుంచి క్రమశిక్షణ అలవరచి చదువులో బాగా ప్రోత్సహించారు. పశ్చిమగోదావరి జిల్లా పెదవేగి మండలం గార్లమడుగు ఎస్ఎంఎస్టీ మెమోరియల్ ఓరియంటల్ హైస్కూల్‌లో చదువుతున్నప్పుడు హెచ్ఎం కె.నాగేశ్వరరావు నాపై చెరగని ముద్ర వేశారు. గురువుల దయతోనే నేను ఈ స్థాయికి ఎదిగాను. టీచర్ ప్రవర్తన విద్యార్థుల జీవితాలకు స్ఫూర్తిదాయకం కావాలి.

– డాక్టర్ షేక్ సలీం బాషా, డీఈవో, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

నిత్యం మననం చేసుకుంటాను



ప్రపంచాన్ని మార్చే శక్తి ఒక్క చదువుకు మాత్రమే ఉంది. అజ్ఞానాన్ని పారదోలి జ్ఞానమార్గంలో నడిపించడం గురువుకే సాధ్యం. గురువు స్ఫూర్తిదాయకంగా ఉంటారు. కాకినాడ ఐడియల్ కళాశాలలో ఇంటర్ చదువుతున్న సమయంలో డాక్టర్ చిరంజీవినీ కుమారి చదువుతో పాటు జీవిత పాఠాలు నేర్పారు. సమాజానికి ఉపయోగపడేలా చదువుకోవాలని చెప్పిన మాటలు నేటికీ మననం చేసుకుంటాను.

– దేవిశెట్టి శ్రీనివాసరావు, జిల్లా రవాణా అధికారి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

వారి ప్రభావం ఎంతో ఉంది



నా విద్యాభ్యాసం అంతా హైదరాబాద్‌లో సాగింది. ఉన్నత పాఠశాలలో తెలుగు టీచర్ పద్మజ, ప్రిన్సిపాల్ శశి ప్రభావం నాపై ఎక్కువగా ఉంది. వారు నేర్పిన క్రమశిక్షణ, నైతిక విలువలు లక్ష్యాన్ని నిర్దేశించాయి. వారిచ్చిన స్ఫూర్తితోనే పోలీస్ అవ్వాలనే కోరిక బలంగా నాటుకుంది. సాంకేతికంగా ఎంత ఎదిగినా ఉపాధ్యాయుల పాత్ర ఎప్పటికీ నిలిచే ఉంటుంది.

– బి.రఘువీర్, డీఎస్పీ, రామచంద్రపురం

నాటు తుపాకీతో వ్యక్తి అరెస్టు



అదుపులోకి తీసుకున్న వ్యక్తితో ఎస్సై పవన్‌కుమార్

గోకవరం: మండలంలోని నాటు తుపాకీ కలిగి ఉన్న వ్యక్తిని అరెస్టు చేసినట్టు స్థానిక ఎస్సై పవన్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలో జగన్నాథపురం శివారు కోళ్ల ఫారంలో ఒక వ్యక్తి నాటు తుపాకీ కలిగి ఉన్నాడని తిరుమలాయపాలెం ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ అమలదాసు భాస్కర్ కృష్ణ ఫిర్యాదు చేశారన్నారు. ఈ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేసి నిందితుడు యమల నాగబాబును గురువారం అరెస్ట్ చేసి, రిమాండ్ నిమిత్తం రాజమహేంద్రవరం కోర్టులో హాజరుపరిచామన్నారు.

సనాతనానికి మూల స్తంభాలు వేదాలు

- ఫణి యజ్ఞేశ్వర సోమయాజులు ఘనపాఠి
- వేద స్వస్తితో పులకించిన అమలాపురం
- ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి 250 మంది వేద పండితుల రాక

అమలాపురం టౌన్: సనాతన సంస్కృతికి మూల స్తంభాలు వేదాలేనని తిరుపతికి చెందిన వేద పండితుడు దూవ్వూరి ఫణి యజ్ఞేశ్వర సోమయాజులు ఘనపాఠి అన్నారు. శ్రీ కోనసీమ వేద శాస్త్ర సన్మాన సభ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక సత్య సాయి కల్యాణ మండపంలో గురువారం జరిగిన 63వ వార్షికోత్సవ వేద సభలో ఆయన ఉపన్యసించారు. ఈ సభకు ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి 250 మంది వేద పండితులు వచ్చి వేదాలను ఘోషించారు. వంక రామకృష్ణ విద్యాశంకర్ అధ్యక్షతన వేదసభ సాగింది. వేద పండితులు కడియాల వేంకట సత్య సీతారామ ఘనపాఠి, శృంగేరి అస్థాన విద్వాంసులు విశ్వనాథ గోపాలకృష్ణ శాస్త్రి, విష్ణుభట్ల సుబ్రహ్మణ్యేశ్వర ఘనపాఠి, గుళ్లపల్లి విశ్వనాథ ఘనపాఠి, విష్ణుభట్ల శ్రీకృష్ణ ఘనపాఠి, హైదరాబాద్‌కు చెందిన హరి సీతారామమూర్తి సలక్షణ ఘనపాఠి, వడ్లమాని సుబ్రహ్మణ్య ఘనపాఠి వేదికపై ఆశీనులై వేదాల విశిష్టతను వివరించారు. వేద ధ్వనితో సమాజ వికాసమే కాకుండా వాతావరణం కూడా పవిత్రం అవుతుందని పేర్కొన్నారు. ప్రపంచానికి రక్ష ధర్మమే, ఆ ధర్మానికి మూలం వేదమే నన్నారు. ఉభయ గోదావరి జిల్లాలో నిత్యం పారే గోదావరి పాయలు వేదల్లా ఘోషిస్తున్నాయంటే అది ఆ వేదాల్లోని శక్తి వల్లేనని పేర్కొన్నారు. అనంతరం వందలాది మంది వేద పండితులు ఒకేసారి పలికిన వేద స్వస్తితో అమలాపురం పట్టణం పునీతమైంది. కోనసీమ భాష వేద ఘోష అన్నట్లుగా స్వస్తి సాగింది. అనంతరం వేద పండితులను వేద శాస్త్ర సన్మాన సభ కార్యదర్శి గుళ్లపల్లి వెంకట్రామ్, సభ సభ్యులు శిష్టా భాస్కర్, కుమారశాస్త్రి, యేడిది సుబ్రహ్మణ్యం తదితరులు ఘనంగా సత్కరించారు. వేదాభిమానులు మండలీక ఆదినారాయణ, పుత్సా కృష్ణ కామేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



అమలాపురం సభలో వేద స్వస్తి చెబుతున్న ఉభయ తెలుగు రాష్ట్రాల వేద పండితులు

వేదాలను పోషించడం అభినందనీయం



ఏడాదికోసారి ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని వేద పండితులను ఆహ్వానించి సత్కరించడం అంటే సాక్షాత్తు వేదాలను గౌరవించడమే. కోనసీమ వేద శాస్త్ర సభ వేదాలను పోషించడం అభినందనీయం. ధర్మాన్ని మనం ఆచరిస్తే వేదాలు మన ధర్మాన్ని కాపాడుతాయి. వేదాలు ఎక్కడ పోషిస్తే అక్కడ వేదాలు శోభిల్లుతాయి. వేద భూమి కోనసీమ. ఈ సీమలో ప్రవహించే నదీ పాయలు కూడా వేదాలు ఘోషిస్తాయి.

– హరి సీతారామమూర్తి, సలక్షణ ఘనపాఠి, వేద పండితుడు, హైదరాబాద్

మానవ మనుగడను నిర్దేశించేవి వేదాలే



మానవ మనుగడను నిర్దేశించేవి వేదాలే. నాలుగు వేదాలతోనే ప్రపంచం నడుస్తోంది. వేదాధ్యయనం, వేదన పఠనం చేసిన పండితులు లోక కల్యాణంలో భాగస్వాములే అవుతారు. కోనసీమ వేద శాస్త్ర సన్మాన సభ వేద పండితులను వామన జయంతి నాడు సత్కరించడం, వేద స్వస్తి చెప్పించం లోక కల్యాణం కోసమే. ఈ సంస్థ వేదాలను పోషించడం మాలాంటి వేద పండితులకు ఎంతో ఆనందం.

– ఉపాధ్యాయుల కాశీ విశ్వ సోమయాజులు, టీటీడీ తెలంగాణ రాష్ట్ర సూపర్‌వైజర్

క్లుప్తంగా

600 కిలోల గంజాయి స్వాధీనం

మలకపల్లి వద్ద కారులో పట్టివేత



పోలీస్ స్టేషన్ వద్ద కారులో పట్టుకున్న గంజాయి బ్యాగ్‌లను లెక్కిస్తున్న సిబ్బంది

తాళ్లపూడి: మండలంలోని మలకపల్లి వద్ద భారీగా గంజాయి పట్టు బడింది. వైజాగ్ జోనల్ యూనిట్ నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో అధికారులకు తమిళనాడు రిజిస్ట్రేషన్‌కు చెందిన ఇన్నోవా కారులో సుమారు 600 కేజీల గంజాయి వస్తున్నట్టు అందిన సమాచారం మేరకు వైజాగ్ నుంచి వెంబడిస్తూ మలకపల్లిలో అదుపులోకి తీసుకున్నారు. కారులో ఉన్న ముగ్గురిలో ఇద్దరు పరారు కాగా, పట్టుబడ్డ మహారాజన్ రాజా అనే వ్యక్తిని తాళ్లపూడి స్టేషన్‌కు తరలించారు. సరకును, వాహనాన్ని, నిందితుడిని రాజమహేంద్రవరం తరలిస్తామని అక్కడి అధికారులు పూర్తి సమాచారం ఇస్తారని తెలిపారు.

ఐరెన్ ట్రాక్టర్ బోల్తా: వ్యక్తి మృతి

ముమ్మిడివరం: ఇనుప ఊసలతో వెళ్తున్న ట్రాక్టర్ ట్రక్కు అదుపు తప్పి బోల్తా పడడంతో వాహనంపై ఉన్న వ్యక్తి మృతి చెందాడు. ముమ్మిడివరం మండలం అయినాపురం అవుట్ ఫాల్ స్లూయిస్ ఏటుగట్టుపై గురువారం ఈ సంఘటన చోటు చేసుకుంది. అయినాపురం ఇరిగేషన్ కార్యాలయం వద్ద ఐరన్‌ను ట్రాక్టర్‌పై మురమళ్ల తరలిస్తుండగా ఏటిగట్టుపై ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో ట్రాక్టర్‌పై ఉన్న యానాం శివారు కురసాం పేటకు చెందిన కూలీ మేడిశెట్టి గోవిందు (48) ఊసలు మధ్య ఇరుక్కుని అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు ముమ్మిడివరం ఎస్సై డి.జ్వాలాసాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

4 వేల కిలోల నల్ల బెల్లం స్వాధీనం

ఇద్దరి అరెస్టు



నల్లబెల్లం రవాణా చేస్తున్న నిందితులు, వ్యాన్‌ను స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ పోలీసులు

ప్రత్తిపాడు: స్థానిక జాతీయ రహదారిపై అక్రమంగా తరలిస్తున్న నాలుగు వేల కిలోల నల్ల బెల్లాన్ని గురువారం ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఒడిశా రాష్ట్రంలోని అంబాగుబా గ్రామం నుంచి కాకినాడ జిల్లా ఏలేశ్వరానికి మినీ గూడ్స్ వేన్‌లో నల్లబెల్లం రవాణా జరుగుతోంది. ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ వై.చైతన్య మురళికి అందిన సమాచారం మేరకు ఎక్సైజ్ ఎస్‌టీఎఫ్ సూపరింటెండెంట్ దేవదత్తు, ప్రత్తిపాడు ఎక్సైజ్ సీఐ పి.శివప్రసాద్ తమ సిబ్బందితో వెళ్లి ధర్మవరం సమీపంలో అదుపులోకి తీసుకున్నారు. గూడ్స్ వేన్‌తో పాటు, 4 వేల కిలోల నల్లబెల్లాన్ని స్వాధీనం చేసుకున్నారు. వేన్ డ్రైవర్లు సామర్లకోటకు చెందిన తుమ్మల వీర వెంకట సూర్యతేజ, పెద్దాపురం మండలం మర్లావ గ్రామానికి చెందిన నక్కా చినవీర్రాజులను అరెస్టు చేశారు. జగ్గంపేట మండలం మామిడాడ గ్రామానికి చెందిన బెల్లం వ్యాపారి దాడి లోవరాజుపై కేసు నమోదు చేసినట్టు ప్రత్తిపాడు ఎక్సైజ్ సీఐ పి.శివప్రసాద్ తెలిపారు. ఈదాడిలో ప్రత్తిపాడు ఎక్సైజ్ ఎస్సై పున్నం వంశీరామ్ తదతర సిబ్బంది పాల్గొన్నారు.

చోరీ కేసులో ఇద్దరి అరెస్టు



విలేకరులతో మాట్లాడుతున్న ఎస్సై జగన్మోహనరావు

తొండంగి: మండలంలోని ఒంటిమామిడి గ్రామంలో ఓ ఇంట్లో చోరీ కేసులో ఇద్దరిని అరెస్టు చేసి చోరీ సొత్తును రికవరీ చేసినట్టు ఎస్సై జగన్మోహనరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఒంటిమామిడిలో ఆగస్టు 11న బొమ్మదేవ్ సారధి ఇంట్లో చోరీ జరిగింది. ఈ ఘటనలో దుండగులు బంగారు, వెండి నగలు, కొంత నగదు చోరీ చేశారు. దీనిపై విచారణ చేపట్టి బుధవారం నిందితులను అనకాపల్లి జిల్లా రేవుపోలవరానికి చెందిన చేపల నాని అలియాస్ స్టైలిష్ నాని, యు.కొత్తపల్లికి చెందిన బొండు శివలను అరెస్టు చేశామన్నారు. వారి నుంచి చోరీ చేసిన నగలు తాకట్టు పెట్టి స్కూటీ కొనుగోలు చేయగా ఆ వాహనంతో పాటు కొంత నగదును రికవరీ చేశామన్నారు. రికవరీ సొత్తు విలువ రూ.2.4 లక్షలు ఉంటుందన్నారు. దర్యాప్తులో కీలకంగా వ్యవహరించిన పీసీలు సీహెచ్ మణి వీరకంత, సీహెచ్ దొర, పి.శివ, కేఆర్వీ సత్యనారాయణ, టి.శ్రీనివాస్, ఆర్.కిశోర్‌లను ఎస్పీ బిందుమాధవ్, డీఎస్పీ శ్రీహరిరాజు అభినందించారని తెలిపారు.

పెన్షన్ సొమ్మును పేకాటలో పోగొట్టారు

- వెటర్నరీ అసిస్టెంట్ అరెస్టు
- అతనితో పాటు మరో కానిస్టేబుల్‌కూ రిమాండ్

రంగంపేట: లబ్ధిదారులకు అందించాల్సిన ఫింఛన్ సొమ్ముతో పరారైన సచివాలయ వెటర్నరీ అసిస్టెంట్ జుత్తుక గణేష్‌ను అరెస్టు చేసినట్టు ఎస్ఐ శివప్రసాద్ తెలిపారు. గురువారం సాయంత్రం ఆయన మాట్లాడుతూ తూర్పు గోదావరి జిల్లా రంగంపేట మండల పరిధిలోని చంద్రేడు సచివాలయానికి సంబంధించిన వెటర్నరీ అసిస్టెంట్ జుత్తుక గణేష్ పింఛన్ల పంపిణీ నిమిత్తం లబ్ధిదారులకు అందించాల్సిన రూ. 2,13,500ను తీసుకుని ఈనెల 30న పరారయ్యాడు. దీంతో పంచాయతీ కార్యదర్శి బోనగిరి వెంకన్నబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు క్రిమినల్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. గురువారం జుత్తుక గణేష్‌ను అదులోకి తీసుకుని విచారించడం జరిగిందన్నారు. తనకు పేకాట ఆడే అలవాటు ఉందని, అంబాజీపేటలో కానిస్టేబుల్‌గా పని చేస్తున్న కొమ్మర్తి నారాయణరావు పెదపూడి పోలీసు స్టేషన్‌లో పనిచేస్తున్నప్పుడు అతినితో పరిచయం ఏర్పడిందని, ఇద్దరం కలసి ఫింఛను సొమ్ముతో విజయవాడలో పేకాట ఆడి డబ్బులన్నీ పోగొట్టుకున్నట్టు చెప్పడంతో ఇద్దరినీ అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఎస్ఐ శివప్రసాద్ తెలిపారు.

ఊరేగింపులో ముగ్గురికి కత్తిపోట్లు

వినాయక నిమజ్జనం సందర్భంగా ఘటన



ఘర్షణలో తీవ్రంగా గాయపడిన బాధితుడు

అల్లవరం: గణేష్ ఉరేగింపులో జరిగిన ఘర్షణలో ముగ్గురు కత్తిపోట్లకు గురైన ఘటన మండలం కొమరగిరిపట్నంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు, వివరాలు ప్రకారం వినాయకచవితి సందర్భంగా గుర్రం వారి వీధిలో వినాయక విగ్రహాన్ని గురువారం ఊరేగించారు. విగ్రహం శివాలయం వద్దకు వచ్చే సరికి వారిలో వారికి ఘర్షణ తలెత్తింది. ఈ నేపథ్యంలో తిక్కిరెడ్డి మోహిత్ మణికంఠ చెడీ తాళింఖానా చేసే కత్తితో సుంకర సురేష్, కొమ్మూరి శంకర్‌లను వెనుక నుంచి పొడిచాడు. మణికంఠ ఇద్దరిపై కత్తితో దాడి చేసిన విషయాన్ని గమనించిన తెలగారెడ్డి హరీష్ అడ్డుపడ్డాడు. దీంతో హరీష్‌పై మణికంఠ దాడి చేసి కత్తితో పొడిచాడు. దీంతో స్థానికులు అప్రమత్తమై రక్తపు మడుగులో ఉన్న ముగ్గురినీ స్థానిక సీహెచ్‌సీకి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. మెరుగైన చికిత్స నిమిత్తం అమలాపురంలోని కిమ్స్‌కు తరలించారు. ఈ వివాదంలో స్వల్పగాయాల పాలైన మణికంఠను కిమ్స్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఎస్సై సంపత్‌కుమార్ ఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు. కిమ్స్ ఆస్పత్రిలో బాధితుల నుంచి పోలీసులు సమాచారం సేకరించి విచారణ చేస్తున్నారు.

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి



నిడదవోలు రూరల్: పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన షేక్ షాకీర్ (35) మురుగు కాలువలో పడి మృతిచెందాడు. గురువారం ఉదయం షాకీర్ మృతదేహన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై జగన్మోహనరావు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

షేక్ షాకీర్ మృతదేహం →

అశ్లీల నృత్యాలపై కేసు : ఐదుగురు నిర్వాహకుల అరెస్టు

నల్లజర్ల: వినాయక నిమజ్జన ఊరేగింపులో భాగంగా అశ్లీల నృత్యాలు చేయించిన నిర్వాహకులను పోలీసులు అరెస్టు చేశారు. తెలికిచెర్లలో వినాయక నిమజ్జనం, ఊరేగింపులో గత నెల 31వ తేదీన హిజ్రాలతో ట్రాక్టర్‌పై అశ్లీల నృత్యాలు చేయించి ప్రజలకు ఇబ్బంది కల్గించిన కమిటీ సభ్యులు రుద్రా శ్రీనివాస్, పాలూరి సుబ్బారావు, కోట వెంకట శ్రీనివాస్, చౌటుపల్లి చిన్ననరసయ్య, అడ్డాల సత్తిపండుపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ దుర్గాప్రసాద్ విలేకరులకు తెలిపారు. వీఆర్వో డి.శ్రీనివాస్ గురువారం ఇచ్చిన ఫిర్యాదుపై సెక్షన్ 292, 296, 50గా కేసు నమోదు చేసినట్టు చెప్పారు. ఈ సందర్భంగా సీఐ బాలశౌరి మాట్లాడుతూ ఊరేగింపులకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలన్నారు. తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ఊరేగింపులలో ఎటువంటి అశ్లీల నృత్యాలు నిర్వహించరాదని, ప్రజలకు ఇబ్బంది కలిగేలా సౌండ్ సిస్టమ్‌లు పెట్టకూడదని, నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

12,190 కిలోల రేషన్ బియ్యం పట్టివేత

సరకు విలువ రూ.5.61 లక్షలు

రాజానగరం: జాతీయ రహదారిపై స్థానిక బీపీసీఎల్ పెట్రోలు బంకు వద్ద అక్రమంగా రవాణా అవుతున్న 12,190 కిలోల రేషన్ బియ్యాన్ని పౌరసరఫరాల శాఖ అధికారులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. టాటా మినీ లారీలో విజయవాడ నుంచి కాకినాడ పోర్టుకు ఈ బియ్యాన్ని తరలిస్తున్నారు. లారీ ఓనర్ కం డ్రైవర్ అయిన పిఠాపురానికి చెందిన గాలి వెంకటేష్‌పై 6ఏ కేసు నమోదు చేశారు. పట్టుబడిన బియ్యం విలువ రూ.5,60,740 ఉంటుందని మండల పౌరసరఫరాల శాఖ అధికారి బాపిరాజు తెలిపారు.

దారి కాసి దాడి చేసి చోరీ

కె.గంగవరం: మండల పరిధిలోని అద్దంపల్లి-యర్రపోతవరం రహదారిలో గుర్తు తెలియని వ్యక్తులు ఆటోలో వచ్చి స్కూటీపై వెళ్తున్న వ్యక్తిని ఆపి అతని వద్ద ఉన్న సొమ్ము, స్కూటీ, బంగారాన్ని దోచుకుపోయారు. స్థానిక ఎస్సై జానీ బాషా తెలిపిన వివరాల మేరకు రామచంద్రపురం మండలం ద్రాక్షారామానికి చెందిన దినేష్ ఆదే గ్రామంలో బంగారు వస్తువులు విక్రయించే దుకాణంతో పాటు తాకట్టు వ్యాపారం చేస్తుంటాడు. ఇతని వద్ద పనిచేస్తున్న యండమూరి శ్రీనివాస్, విశ్వనాథం బుల్లియలు ద్రాక్షారామం నుంచి ప్రతి రోజు యానం వెళ్లి వ్యాపారం పూర్తయ్యాక రాత్రికి ఇంటికి తిరిగి వస్తుంటారు. ఈ క్రమంలో బుధవారం శ్రీనివాస్ రాత్రి ఇంటికి వచ్చేటప్పుడు అద్దంపల్లి గ్రామానికి చెందిన బుల్లియ్యను యానం నుంచి తన స్కూటీపై తీసుకుచ్చి అద్దంపల్లి గ్రామంలో దింపి తిరిగి ద్రాక్షారామానికి వెళ్తుండగా యర్రపోతవరం వద్ద గుర్తు తెలియని వ్యక్తులు ఆటోలో వచ్చి శ్రీనివాస్‌ను గాయపరిచి అతని వద్ద ఉన్న 12 గ్రాముల బంగారు ఆభరణాలతో పాటు రూ.5 వేల నగదు, స్కూటీ, పద్దు పుస్తకాలను పట్టుకుని వెళ్లిపోయారు. ఈ సంఘటనపై శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కె.గంగవరం ఎస్సై జానీ బాషా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.